న్నాయని తనకు చాలాకాలం నుండి కొరతగావున్న రామారావు వాచీకొట్టులో వెస్టుఎండ్ వాచే, రిస్టుకు అందమైంది తీసుకున్నాడు.

అమ్మకాలు లేకపోడంతో ప్రజలనాకర్షించాలని అప్పటికే ధరలు తగ్గించేరు వర్తకులు. డబ్బులేక బజారు మొఖం చూడని ప్రజలు కొత్తఆశలతో బజారుకు వస్తూపోతూన్నప్పుడు ధరలు కొత్తగాతగ్గేయని సంబరపడ్డారు. ఒకరు మరొకరితో విశేషంగా చెప్పుకోడం జరిగింది. ధరలు తగ్గేయని అందరూ బజారుకు రావాలని ఉత్సాహపడ్డారు. అందరూ కొద్దిరోజుల్లో డబ్బు చేతిలో పడుతుందని తప్పక వారి అవసరం కొద్దీ వస్తువులు కొనాలని ఏదోవిధంగా బజారుకు వస్తున్నారు. శివపురంఅంతా నూతన వస్తువులుకొనే ఉత్సాహంతో మొగ్గిపోయింది బేరాలులేక మొగాలు దిగాలువేసుకొని కూర్చున్న వర్తకులంతా చాలా హడావుడిగ ఉన్నారు. అందరూ ఉత్సాహంగా బజారులో తిరుగుతూన్నారు. కొత్తవస్తువులు కొంటున్నారు. శివపురానికి మళ్ళీ శోభ వచ్చింది. ఇంత ఆకస్మిక మార్పుకు కారణం ఎవరికి తెలియదు. అంతా వింతగా ఉన్నది!

రావు ఆఫీసరుగారిమార్పులగురించి ఎదురుచూస్తున్నాడు. ప్రాక్ట్యాడమెంటుకోసం వచ్చే ఆఫీసర్లతో ధీమాగా మాట్లాడేవాడు. వారం అయింది. రెండోవారం దాటింది. మూడోవారం కూడా వెళ్ళుతూంది. రోజురోజుకు నిరాశ ఎక్కువయింది. ఆ వేళ బజారుకు వచ్చేడు. ఎనారిలా తయారైన బజారంతా ఇప్పుడు కోలాహలంతో కన్నుల పండువుగా ఉంది. అంతలో మిల్లను శరభయ్య ఈవేళ పేపర్లో కంట్రోళ్ళు ఎత్తేశారని పడిందండి అని సంతోషంగా పరుగెత్తుకువచ్చి చెప్పేడు. రావు అలాగే స్తంభంలాగు నిలబడి, కోలాహలం చూస్తూ "ఇదంతా ఆఫీసరు చేసిందే" అని అన్నాడు. శరభయ్య తల పంకించి సంతోషంగా పేపరు సర్దుకుంటూ రావుని విడిచి వెళ్ళిపోయేడు.

# * ఏది నిజం? *

రచన:
ఆలపర్తి వెంకటసుబ్బారావు

మా రామయ్యతాత "ఏరా మనుమడా బాగున్నావా?" అంటూ ఆదుర్దాగా ప్రవేశించాడు నే చదువుకుంటున్న గదిలోకి. "ఓ హెూ హెూ తాతగారా ఏమిటి! స్వర్గంనుంచి ఇదేనా రావటం? విశేషాలేమిటి? స్వర్గం ఎలావుంది? అక్కడగూడ మనలాగే నాగరికత అభివృద్ధి చెందిందా? వాళ్లకు మర్యాదన్నది తెలుసా? నీవు పోగానే అలసట తీరటానికై ఆర కప్పుకాఫీ అన్నా యిచ్చారా!" అంటూ గుక్క త్రిప్పుకోకుండా ప్రశ్నల వర్షం కురిపించాను. నా స్నేహితుడు నాసరయ్య నివ్వెఱపడి చూస్తున్నాడు ఇలా బ్రతికున్న మనిషిని నిలువున చంపేశావేమిటిరా అని. "పోరా ఎప్పుడూ చమత్కారమేనా?" అంటూ మా రామయ్యతాత గదినుండి బయటకు జారుకున్నాడు "ముసలాయనతో నట్రా పరిహాసం. అందులోనూ బ్రతికున్న మనిషి చచ్చినవారిలో జమకట్టి మాట్లాడితే ఆయన మనస్సు చివుక్కుమనదట్రా"అన్నాడు నాసరయ్య. ఇక నేను మా తాతగారి విచిత్రచరిత్ర స్నేహితుడు నాసరయ్యకు చెప్పవలసివచ్చింది.

కాకులకలయిక కళ్ళారగాంచినచో, కొలదికాలంలోనే మనం మృత్యువువాతబడటం తథ్యం అంటారు పెద్దలు. ఆ అనుమానమే పెనుభూతమై పీడించింది మా రామయ్యతాతను. ఇంతకు ఆయన పడకకుర్చీలో పడుండి ఎదురుగావున్న కొబ్బరిచెట్టుపైకి చూశాడు కాయలున్నాయా లేవా అని. కాయల సంగతెలావున్నా, కాకుల కలయిక కళ్ళారగాంచాడు. శనిబట్టినచో ఆ పీడ వదలడానికై నువ్వులు దానంచేస్తారు. అలాగే మృత్యువువాతనుండి బయటపడాలంటే మా రామయ్యతాత తను బ్రతికుండగానే చనిపోయినట్లు పుకారు పుట్టించి బంధువులచేత కన్నీళ్ళు పెట్టించాలి. అందుకొఱకై మా రామయ్యతాత ఏం జేశాడో తెలుసా! తను చనిపోయినట్లుగా కబురుచేశాడు మాయింటికి చాకలివానిచేత. "బాబుగారు అగస్మాత్తుగా గుండె ఆగి చనిపోయారండీ" అన్నాడు వాడు మా బామ్మతోటి. ఇంకేముంది ఆమె హిందూస్తాని ముఖారి మొదలుపెట్టింది. ఆ రాగం విన్న ఇరుగు పొరుగువారంతా వచ్చి ఆమెను ఓదార్చడం మొదలెట్టారు.

ఇదంతా నే గమనిస్తూనే వున్నా కుర్చీలో కూర్చొని. ఇంతలో యీ ఏడ్పులు మొత్తుకోళ్లకు నవ్వు వచ్చింది గాబోలు చాకలివాడు ఒక్కసారి నవ్వాడు. ఏమిట్రా అలా నవ్వుతావ్ అని అడిగారంతా ఆదుర్దాగా. నేనూకుర్చీలో నుంచి లేచివచ్చా. "ఇదిగో చూడండి" అంటూ ఒక కాగితం నా చేతికిచ్చాడు.

అందులో తను కాకుల కలయిక చూచినట్లు, అది దుశ్శకునమని, నివారణార్థం ఇలా కబురు పంపినట్లు, ఇంతకు తను క్షేమంగానే వున్నట్లు తెలియబరచాడు మా రామయ్యతాత. అంతటితో అక్కడున్నవారంతా కడుపు చెక్కలయ్యేటట్లు నవ్వడం మొదలెట్టారు. అంతే ఏడిస్తే అలా ఏడుస్తారు. నవ్వితే యిలా నవ్వుతారు.

తరువాత మా తాతయ్యదగ్గరనుంచి చాలా వుత్తరాలు వచ్చాయి తను క్షేమంగా వున్నట్లు.

ఇంతకు దుశ్శకున నివారణార్థం పుకారు పుట్టించడం మూలంగా ముసలాయన మృత్యువును జయించాడంటుంది మా బామ్మ.

"మృత్యువు సమీపించెనా, కోటి వేల్పులయినా మరణము మాన్పజాలరు" అని చిన్నయసూరిగారు మిత్రభేదములో నొక్కి వక్కాణించారు... ఇంతకు ఏది నిజం?